## క్లుప్తంగా

### కోడిపందేలు, పేకాట ఆడితే చర్యలు తప్పవు

**వేంపల్లె :** మండల వ్యాప్తంగా ఎక్కడైనా కోడి పందేలు, పేకాట ఆడితే, అలాగే నిర్వాహకులపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని సీఐ సురేష్‌రెడ్డి హెచ్చరించారు. సాంప్రదాయ ఆటలు ఆడుకోవాలని సూచించారు. కోడి పందేల జూదరులు, పేకాట నిర్వాహకులపై ఇప్పటికే నిఘా పెట్టినట్లు తెలిపారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఎవరైనా మండలంలో కోడి పందేలు నిర్వహించినా, పందేలు నిర్వహణకు స్థలాలు, భూములు ఇచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత ఇటువంటి కేసులలో ఉంటే వారి యొక్క భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు.

### లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న పీహెచ్‌సీ డాక్టర్‌ స్రవంతి

**సింహాద్రిపురం :** లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని కోవరంగుంటపల్లె పీహెచ్‌సీ డాక్టర్‌ స్రవంతి తెలిపారు. శుక్రవారం కోవరంగుంటపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె ఆధ్వర్యంలో డిప్యూటీ డెమో రమణమ్మ గర్భస్థ పూర్వ, పిండ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం గురించి అవగాహన కల్పించారు. గర్భిణులు ఆసుపత్రికి వెళ్లి స్కాన్‌ చేయించుకునేటప్పుడు డాక్టర్లను ఆడ, మగ గురించి అడగరాదని, అలా అడిగిన ఎడల వారికి, చెప్పిన వారికి జైలు శిక్షతోపాటు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. హెల్త్‌ సూపర్‌వైజర్లు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### నల్లబ్యాడ్జీలతో నిరసన




నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్‌ అధికారులు, సిబ్బంది

**ఎర్రగుంట్ల :** మున్సిపల్‌ అధికారులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలతో కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్‌ కమిషనర్‌ శేషఫణి మాట్లాడుతూ కల్యాణదుర్గం, నంద్యాల మున్సిపల్‌ కమిషనర్లపై కొందరు ప్రైవేటు వ్యక్తులు దాడి చేశారన్నారు. అందుకు నిరసనగా మున్సిపల్‌ కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులు సిబ్బంది నిరసన చేసినట్లు తెలిపారు.

### నివాళి



నారాయణరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి

**వల్లూరు (చెన్నూరు) :** మండలంలోని కొండపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌ సీపీ నాయకుడు గోపిరెడ్డి శంకర్‌రెడ్డి మామ బీయ్యపు నారాయణరెడ్డి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథరెడ్డి మృతుని స్వగృహానికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు.

### క్యాలెండర్‌ ఆవిష్కరణ

**ముద్దనూరు :** సచివాలయ ఉద్యోగుల సంఘం యునైటెడ్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో ఎంపీడీవో ముకుందరెడ్డి సచివాలయ సిబ్బందితో కలసి క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్‌ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్‌ సెక్రటరీ యాసీన్‌, ముద్దనూరు మేజర్‌ పంచాయతీ కార్యదర్శి నరసింహులు, బొందలకుంట పంచాయతీ కార్యదర్శి మౌలానా, కొర్రపాడు పంచాయతీ కార్యదర్శి బలరాముడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు విద్యుత్‌ సరఫరా నిలిపివేత

**లింగాల :** మండలంలోని వెలిదండ్ల, కోమన్నూతల, తాతిరెడ్డిపల్లె 33/11కె.వి విద్యుత్‌ సబ్‌స్టేషన్లలో మెయింటెన్స్‌ కారణంగా శనివారం ఉదయం 9.30 గంటల నుంచి 11.30గంటల వరకు విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నామని విద్యుత్‌ ఏఈ బాల సంజీవులు తెలిపారు. ప్రజలు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

### 12న నవోదయ మోడల్‌ పరీక్ష

**చింతకొమ్మదిన్నె :** జనవరి 18వ తేదీన జరగబోయే జవహర్‌ నవోదయ ప్రవేశ పరీక్ష ఎంపికకు విద్యార్థుల సౌకర్యార్థం ఈనెల 12వ తేదీన స్థానిక భగత్‌సింగ్‌ నగర్‌లోని దిన్నెపాటి బసిరెడ్డి వికాస్‌ కోచింగ్‌ సెంటర్‌లో నమూనా పరీక్షను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్‌ బసిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

నమూనా పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్‌ టికెట్‌ జిరాక్స్‌ కాపీని తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాల కోసం 9390921596పై నెంబర్లను సంప్రదించాలని కోరారు.

# వైకుంఠ వాస నమోస్తుతే..

- వైష్ణవ ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి శోభ
- ఉత్తర ద్వారం వైపున స్వామివారిని దర్శించుకున్న భక్తజనం
- కన్నుల పండువగా శ్రీరంగనాథస్వామి కల్యాణం



వీఎన్‌పల్లెలో కల్యాణమహోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

**పులివెందుల టౌన్‌ :** వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పులివెందులలోని వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శుక్రవారం ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీ వేంకటరమణస్వామి ఆలయం, శ్రీరంగనాథస్వామి ఆలయం, శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాలలో తెల్లవారు జామునుంచే భక్తులు ఉత్తర ద్వారం వైపు నుంచి శ్రీవారిని దర్శించుకున్నారు. ముక్కోటి ఏకాదశి నాడు స్వామివారిని ఉత్తర ద్వారం గుండా వెళ్లి దర్శిస్తే మోక్షం లభిస్తుందని భక్తుల నమ్మకం. ఆలయ అర్చకులు కృష్ణరాజేష్‌ శర్మ, వరదాచార్యులు స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే పట్టణంలోని శ్రీరంగనాథస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. మున్సిపల్‌ ఇన్‌చార్జి వైఎస్‌ మనోహర్‌రెడ్డి, మున్సిపల్‌ చైర్మన్‌ వరప్రసాద్‌, తదితరులు దర్శించుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

**పులివెందుల రూరల్‌ :** మున్సిపాలిటీ పరిధిలోని ఉలిమెల్ల గ్రామ సమీపంలో వెలసిన శ్రీపద్మాభూతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

**బండలాగుడు పోటీల విజేత చౌటుపల్లె ఎద్దులు :** ఉలిమెల్ల గ్రామంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా నిర్వహించిన బండలాగుడు పోటీల్లో చౌటుపల్లెకు చెందిన చంద్ర కోడె ఎద్దులు ప్రథమ బహుమతిని సాధించాయి. వైఎస్‌ఆర్‌ సీపీ మున్సిపల్‌ ఇన్‌చార్జి వైఎస్‌ మనోహర్‌రెడ్డి ఎద్దుల ఈ పోటీలను ప్రారంభించారు. ఎంవీఎస్‌ ఆర్‌ బుల్స్‌ రూ.40 వేలు ద్వితీయ, వేంపల్లెకు చెందిన రమణయ్య ఎద్దులు రూ.30 వేలు తృతీయ, రాజువారిపేటకు చెందిన శ్రీకాంత్‌రెడ్డి ఎద్దులు రూ.20 వేలు నాల్గవ, వరదాయపల్లెకు చెందిన శ్రీరాములు ఎద్దులు రూ.10 వేలు ఐదవ బహుమతిని పొందాయి. మొదటి బహుమతిని పొందిన చంద్రకు మాజీ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పేరు మీదుగా రూ.50వేల నగదును గ్రామస్తులు అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

**వల్లూరులో..**

**వల్లూరు :** వైకుంఠ ఏకాదశి పర్వ దినాన్ని పురస్కరించుకుని పవిత్ర పుణ్యక్షేత్రమైన పుష్పగిరిలో కొలువైన శ్రీ చెన్నకేశవస్వామి ఉత్తర ద్వార దర్శనానికి శుక్రవారం భక్తులు తరలి వచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు అఖిల్‌ దీక్షితులు ఆధ్వర్యంలో తెల్లవారు జామున అలంకార ప్రియుడైన శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామికి బిందె తీర్థ సేవ, విశేష ఆరాధన, ప్రాతఃకాల ఆరాధన, తులసి, బిల్వ పత్రార్చన నిర్వహిం



వేంపల్లె : ఫలాల అలంకరణలో శ్రీవెంకటేశ్వరస్వామి

చారు. అభిషేక ప్రియుడైన శివునికి అభిషేకాలను నిర్వహించారు. పవిత్ర పెన్నా నదిలో స్నానాలు ఆచరించిన భక్తులు శ్రీ వెంకటేశ్వరస్వామి అలంకారంలో దర్శనమిచ్చిన శ్రీ చెన్నకేశవుని ఉత్తర ద్వారం ద్వారా దర్శనం చేసుకుని తరించారు. ఉదయం నుండి ఉత్తర ద్వారానికి ఎదురుగా గరుడవాహనంపై కొలువుదీరి భక్తులకు సుమనోహరంగా దర్శనమిచ్చిన స్వామివారి ఉత్సవమూర్తికి భక్తులు కాయ కర్పూరాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్న ప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం కొండపై నుండి స్వామివారిని పల్లకిలో మోస్తూ మంగళవాయిద్యాలతో గ్రామంలో గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

**కమలాపురంలో..**

**కమలాపురం :** మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. రామాపురంలో వెలసిన శ్రీ మోక్ష నారాయణస్వామి ఆలయంలో ఆలయ ప్రధాన సేవకుడు సాయినాథ శర్మ ఆధ్వర్యంలో ఉత్తర ద్వారం గుండా స్వాముల వారిని భక్తులు దర్శించుకున్నారు. మోక్ష నారాయణ, సుబ్రమణ్య స్వాముల వారి కల్యాణం నిర్వహించారు. భక్తులను చెక్క భజన, కోలాటం, తాళ భజన ఆకట్టుకున్నాయి. వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్‌ రామాంజులరెడ్డి, వైఎస్సార్‌ సీపీ సీనియర్‌ నేత మాజీ జోనల్‌ చైర్మన్‌ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, కేసీ కెనాల్‌ ప్రాజెక్ట్‌ కమిటీ వైస్‌ చైర్మన్‌ రెడ్యం చంద్రశేఖర్‌ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ నాయకులు పాల్గొన్నారు.

**వేములలో..**

**వేముల :** మండల వ్యాప్తంగా ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయాలు వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని భక్తులతో నిండిపోయాయి. శుక్రవారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని భక్తులు ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని దర్శించుకున్నారు.

**వేంపల్లెలో..**



వీఎన్‌పల్లెలో మాంగళ్యధారణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు



ఎర్రగుంట్లలో ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామి మూలవిరాట్‌

**వేంపల్లె :** స్థానిక పాపాఘ్ని నది ఒడ్డున ఉన్న ఎద్దుల కొండపై వెలసిన శ్రీలక్ష్మీవృషభాచలేశ్వర స్వామి దేవస్థానం, నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం, మెయిన్‌ బజార్‌లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో భక్తులకు ఆలయ ఈఓ విశ్వనాథరెడ్డి వైకుంఠ ద్వార దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పలు ఆలయాలకు జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, సర్పంచ్‌ శ్రీనివాసులు, మండల కన్వీనర్‌ చంద్రఓబుల్‌రెడ్డిలు హాజరై పూజలు చేశారు. కన్యకా పరమేశ్వరి ఉత్సవమూర్తులను గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు.

**సింహాద్రిపురంలో..**

**సింహాద్రిపురం :** స్థానిక శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ముక్కోటి వైకుంఠ ఏకాదశి వేడుకల సందర్భంగా గుజ్జల అమరనాథరెడ్డి దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం స్వామివారిని ఉత్తర ద్వారం నుంచి



పులివెందుల : శ్రీరంగనాథుని ఆలయంలో వైకుంఠ ద్వారంకోసం క్యూకట్టిన భక్తులు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్‌ ఇన్‌చార్జి వైఎస్‌ మనోహర్‌రెడ్డి



సింహాద్రిపురంలో వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భక్తులు వెళ్లి దర్శించుకున్నారు. సాయంత్రం శ్రీవెంకటేశ్వరస్వామి గ్రామోత్సవం కన్నుల పండువలా నిర్వహించారు అలాగే మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. గోపాలస్వామి ఆలయంలో కూడా ముక్కోటి ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగాయి.

**వీరపునాయునిపల్లెలో..**

**వీరపునాయునిపల్లె :** మండలంలోని మొయిళ్లచెరువు గ్రామ సమీపంలోని తిరుమలరాయుని కొండపై వెలసిన తిరుమలేసుని ఆలయం, ఉరుటూరు గ్రామంలో వెలసిన భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వైకుంట ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఉత్తర ద్వార దర్శనాన్ని ఏర్పాటు చేశారు. వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు ఉమామహేశ్వర శర్మ నిర్వహించారు. అన్నమయ్య సంకీర్తనలు, గ్రామస్తులచే ఏర్పాటు చేసిన తాళాల భజన, దండుపల్లె వాసులు నిర్వహించిన కోలాటం భక్తులను ఎంతగానో ఆకట్టుకొంది. సాయంత్రం ఏర్పాటు చేసిన ఊంజల్‌ సేవ భక్తులను కనువిందు చేసింది. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

**కొండాపురంలో..**

**కొండాపురం :** మండలంలోని వైష్ణవ ఆలయాల్లో భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. మండలంలోని బెడుదూరు గ్రామ సమీపంలోని కొండపైన వెలసిన శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో



వేములలో వెంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పూజలు నిర్వహించి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

**ముద్దనూరులో..**

**ముద్దనూరు :** స్థానిక శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీచెన్నకేశవస్వామి ఆలయం, వనంలోని శ్రీరంగనాథస్వామి సన్నిధిలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి భక్తులు ఉత్తర ద్వారం నుంచి ఆలయంలో వెలసిన మూర్తులను దర్శించుకున్నారు.

**ఎర్రగుంట్లలో..**

**ఎర్రగుంట్ల :** ఎర్రగుంట్ల, చిలంకూరులలో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన ఉత్తర ద్వారం నుంచి భక్తులు శ్రీ వేంకటేశ్వర స్వామిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. పెద్దనపాడు శివాలయం, వేంపల్లి రోడ్డులోని శ్రీరామాలయంలో ఉత్తర ద్వారం ఏర్పాటు చేశారు. ఈ ఆలయాన్ని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు ఎంవీ రామచంద్రారెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

**లింగాలలో..**

**లింగాల :** మండలంలోని అన్ని దేవాలయాలకు భక్తులు పోటెత్తారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా మహిళలు ఆలయాలకు చేరుకుని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. మండలంలోని అన్ని రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### నేడు అన్నదానం

**ముద్దనూరు :** నేడు వైకుంఠ ద్వాదశి పర్వదినం సందర్భంగా వనంలోని శ్రీలక్ష్మీ రంగనాయకుల ఆలయంలో అన్నదానం నిర్వహించనున్నారు. శనివారం ఆలయం ప్రాంగణంలో ఉదయం 11 గంటలనుంచి అన్నదాన కార్యక్రమం జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

### ముందస్తు సంక్రాంతి సంబరాలు



సంబరాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

**పులివెందుల టౌన్‌ :** పట్టణంలోని స్థానిక శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్‌ నారాయణరెడ్డి రైతులు పంట చేతికొచ్చిన వేళ కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకునే పండుగ సంక్రాంతి పండుగ అన్నారు. అలాగే కళాశాల డైరెక్టర్‌ వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ భోగి మంటలతో భోగ భాగ్యాను సమకూర్చే పండుగ సంక్రాంతి అని తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్‌ వై.నారాయణరెడ్డి, కళాశాల డైరెక్టర్‌ నీరజ, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఘనంగా ఫ్రెషర్స్‌ డే వేడుకలు

**చింతకొమ్మదిన్నె :** మండల పరిధిలోని ఊటుకూరు ప్రకృతినగర్‌లోని రామిరెడ్డి ఫార్మసీ కళాశాలలో ఫ్రెషర్స్‌ డే వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా ఎంప్లాయిమెంట్‌ అధికారి సురేష్‌కుమార్‌ పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. ఆచార్యులు నరసింహ, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీలను అమలు చేయాలి

**ఎర్రగుంట్ల :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలని సీపీఐ జమ్మలమడుగు నియోజకవర్గ కార్యదర్శి ఎంవీ సుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం ఎర్రగుంట్ల తహసీల్దార్‌ కార్యాలయం వద్ద సీపీఐ మండల సమితి అధ్వర్యంలో వారు ధర్నా నిర్వహించి తహసీల్దార్‌ శోభన్‌బాబుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణాలలో రెండు సెంట్లు, ఇంటిస్థలం అర్హులైన పేదలకు ఇచ్చి ఇంటి నిర్మాణంకు రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. కోనేరు రంగారావు కమిటీ సిఫారసు మేరకు రెండెకరాల సాగు భూమి పేదలకు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

**కమలాపురంలో..**

**కమలాపురం :** పేద ప్రజలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు స్థలాలు ప్రభుత్వం ఇచ్చే వరకు పోరాటం సాగిస్తామని సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి జి.నాగేశ్వరరావు డిమాండ్‌ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డిటీ రోష్నీ హుసేన్‌కు వినతి పత్రం అందజేశారు. పేదలకు ఇంటి స్థలాలు దక్కే వరకు పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

**చింతకొమ్మదిన్నెలో..**

**చింతకొమ్మదిన్నె :** కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు అర్హులైన పేదలకు రెండు సెంట్లు ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇచ్చి ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, కడప నగర కార్య




ఎర్రగుంట్లలో తహసీల్దార్‌ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

దర్శి ఎస్‌.వెంకటశివ డిమాండ్‌ చేశారు. శుక్రవారం చింతకొమ్మదిన్నె కార్యాలయం వద్ద కడప కార్పొరేషన్‌ పరిధిలోని 16, 17, 18 డివిజన్లకు సంబంధించిన ఇల్లు లేని పేదలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటశివ మాట్లాడుతూ సీపీఐ అధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా గత నెలలో సచివాలయాల వద్ద ఇళ్ల స్థలాల కొరకు పేదలు దరఖాస్తు చేసుకున్నారని వారంతా తహసీల్దార్‌ కార్యాలయం వద్ద నిరసన తెలిపి అర్జీలు సమర్పిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం పేద ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీని నెరవేర్చాలన్నారు. ధర్నా అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌ రోనాల్డ్‌కు వినతిపత్రం, ఇళ్ల స్థలాల అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

**జమ్మలమడుగులో..**

**జమ్మలమడుగు :** అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలతోపాటు భూమిలేని వారికి భూమిని కేటాయించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్‌ తెలిపారు. శుక్రవారం ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ ఆర్డీఓ కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్‌ రూపేష్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రస్తుతం గతంలో పాలకులు ఇచ్చిన భూములను



జమ్మలమడుగులో ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

ఎన్‌డీఏ కూటమి నాయకులు కబ్జాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. పేదవాడికి సాగు భూమి పంపిణీకి నిరాకరిస్తున్న అధికారులు భూ బదలాయింపుల పేరుతో ఆదాయానికి మించిన ఆస్తులను కూడబెట్టుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూమిలేని నిరుపేదలకు భూములను ఇవ్వాలని డిమాండ్‌ చేశారు.

**కొండాపురంలో**

**కొండాపురం :** అర్హులైన పేదలకు వెంటనే ఇంటి స్థలాలు, సాగు భూమి రెండు ఎకరాలు కేటాయించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్‌ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట సీపీఐ రాష్ట్ర సమితి మేరకు ఏఐటీయూసీ ప్రజాసంఘాలతో ఆందోళన చేపట్టారు. సీపీఐ మండల కార్యదర్శి మనోహర్‌బాబు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా పేదలకు పట్టణప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, సాగు భూమి రెండు ఎకరాలు ఇస్తామన్న హామీని అమలు చేయకపోతే కడప కలెక్టరేట్‌ ఎదుట ధర్నా చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి వైవీ



కొండాపురంలో తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట ఆందోళన చెస్తున్న ప్రజా సంఘాలనాయకులు



వల్లూరు తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

సుదర్శన్‌రెడ్డి, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు సుబ్బరావు, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు

**వల్లూరులో..**

**వల్లూరు :** అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేసే వరకు పోరాటం సాగిస్తామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గుంటి వేణుగోపాల్‌, పి.చంద్రశేఖర్‌ తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట అర్జీదారులతో కలసి ధర్నా నిర్వహించారు. పేద ప్రజలకు సాగు భూములతో పాటు ఇంటి స్థలాలు ఇవ్వాలని నినాదాలు చేశారు. అధికార పార్టీ నేతలకు అధికారులు డీకేటీ మాఫీయాకు విలువైన ప్రభుత్వ వంక, వాగు, చెరువు, రస్తా, అసైన్డ్‌, దేవాదాయ, ఈనాం, వక్ఫ్‌ భూములను కట్టబెట్టి కొమ్ము కాస్తున్నారని మండి పడ్డారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ ఇన్‌చార్జికి సన్మానం

**కమలాపురం :** నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్‌ రామాంజులరెడ్డిని స్థానిక నేతలు సన్మానించారు. ఇటీవల సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి స్థానిక నాయకుడు సుమిత్రా రాజశేఖర్‌రెడ్డిని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించారు. దీంతో శుక్రవారం పార్టీ కార్యాలయానికి వచ్చిన నరేన్‌ రామాంజులరెడ్డిని పదవి పొందిన రాజశేఖర్‌రెడ్డి శాలువ కప్పి పూలమాలతో సత్కరించారు. కార్యక్ర



నరేన్‌ రామాంజులరెడ్డిని సన్మానిస్తున్న స్థానిక నేతలు

మంలో వైఎస్సార్‌ సీపీ నాయకులు పాల్గొన్నారు.

## మున్సిపల్‌ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**జమ్మలమడుగు :** మున్సిపల్‌ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుబ్బరావమ్మ డిమాండ్‌ చేశారు. శుక్రవారం స్థానిక పాత బస్టాండ్‌ వద్ద తమ సమస్యలను పరిష్కరించాలంటూ మున్సిపల్‌ కార్మికుల నిరాహార దీక్షలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్‌ కార్మికులకు రూ.26 వేలు జీతం ఇస్తామన్న హామీని అమలు చేయాలన్నారు. ప్రభుత్వం వచ్చి 8 నెలలవుతున్నా మున్సిపల్‌ కార్మికుల సమస్యలు



రిలే దీక్షలు చేస్తున్న మున్సిపల్‌ కార్మికులు

ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమం మరింత ఉధృతంగా కొనసాగిస్తామని హెచ్చరించారు.

### ఆత్మవిశ్వాసం పెంపొందించేవి క్రీడలే



వాలీబాల్‌ ఆడుతున్న క్రీడాకారులు

**కమలాపురం :** క్రీడలు ఆరోగ్యం... ఆత్మ విశ్వాసం పెంపొందిస్తాయని సీఎస్‌ఎస్‌ఆర్‌ అండ్‌ ఎస్‌ఆర్‌ఆర్‌ఎం డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్‌ రాజగోపాల్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్‌ రోషిణి హుసేన్‌ తెలిపారు. శుక్రవారం స్థానిక ఆ కళాశాలలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, మదర్‌ థెరిసా సేవా సమితి ఛారిటబుల్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో గ్రామీణ స్థాయి వాలీబాల్‌ స్పోర్ట్‌ మీట్‌ను నిర్వహించారు. ఈ మీట్‌లో 12 టీంలు పాల్గొనగా డిగ్రీ కళాశాల టీం విన్నర్స్‌గా, పీవీఎస్‌ఆర్‌ఎం జూనియర్‌ కళాశాల టీం రన్నర్స్‌గా నిలిచాయి. వారికి రూ.3వేలు, రూ.2వేల నగదు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు, మెమెంటోలను వారు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు మణికంఠ, జూటూరు విజయ్‌, పీఈటీ ఖాదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్‌ అభిషేక్‌రెడ్డి ప్రేమాభిమానాలు మరువలేనివి

**లింగాల :** డాక్టర్‌ వైఎస్‌ అభిషేక్‌రెడ్డి ప్రేమాభిమానాలు మరువలేనివని లింగాల మండల వైఎస్సార్‌ సీపీ నాయకులు, ప్రజలు తెలిపారు. వైఎస్‌ అభిషేక్‌రెడ్డి 2024 సార్వత్రిక ఎన్నికల్లో లింగాల మండల వైఎస్‌ఆర్‌సీపీ ఇన్‌చార్జిగా ఉంటూ మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించి వృద్ధులను, పిల్లలను, మహిళలను, యువకులను, కార్యకర్తలను ఆప్యాయంగా చిరునవ్వుతో పలకరిస్తూ వారి సమస్యలను తెలుసుకుంటూ ఎన్నికల ప్రచారం సాగించారు. ఆయన ఎంతోమంది రోగులను పరామర్శించి వారి వైద్య సేవల కోసం సొంత నిధులను వెచ్చించి వైద్యం అందించారని, మెరుగైన వైద్యం కోసం ఇతర రాష్ట్రాలలోని కార్పొరేట్‌ ఆసుపత్రులకు కూడా పంపడం జరిగిందని కొనియాడారు. ఆయన ఆకస్మిక మరణంతో మండల ప్రజలు తీవ్ర ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఆయన మరణం లింగాల మండలానికి తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## అన్నమాచార్య కళాశాలలో సంక్రాంతి సంబరాలు

**చింతకొమ్మదిన్నె :** కడప నగరంలోని అన్నమాచార్య ఇంజనీరింగ్‌ కళాశాలలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ సుధాకర్‌రెడ్డి బోగిమంటలతో సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు, ఉట్టికొట్టే కార్యక్రమం, వంటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమాలలో మహిళా అధ్యాపకులు, విద్యార్థినుల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివిధ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను ప్రధానం చేశారు.



ఉట్టి కొడుతున్న విద్యార్థిని